క్లుప్తంగా

ఆలయానికి వెండి వింజామరల సమర్పణ


మహాలింగేశ్వరస్వామి ఆలయానికి వెండి వింజామరలు అందజేస్తున్న సత్యనారాయణ

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలు అభివృద్ధికి నోచుకోవాలని బలుసు సత్యనారాయణ అన్నారు. గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయానికి బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు మంగళవారం వెండి వింజామరలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో నూతనంగా నిర్మించే ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామని సత్యనారాయణ తెలిపారు. కాశీ నుంచి వింజామరలను తీసుకువచ్చి జిల్లాలో నూతనంగా నిర్మించిన ఆలయాలకు అందజేస్తున్నామన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు దీక్షత శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొర్లపాటి సుబ్రహ్మణ్యం, బలుసు మంగాయమ్మ, కె.వెంకట శివరామకృష్ణ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

తాళ్లపూడి: పెద్దేవంలో సమతా యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, గ్రామంలోని విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ మాట్లాడుతూ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, గ్రామస్తులు గెడ్డం సాయిబాబా, కొండే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం

ఉండ్రాజవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండలంలో కాల్దారి గ్రామంలో చైతన్య యూత్, రెడ్‌క్రాస్ సంస్థ తణుకు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చీపుళ్ల కుమారి ప్రారంభించారు. సుమారు 18 మంది రక్తదానం చేశారు. కమిటీ ఆర్గనైజర్ అమిరపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో రక్తదాతలకు రెడ్‌క్రాస్ సంస్థ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి శ్రీను, చీపుళ్ల అశోక్, రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జ్ సూర్య, టెక్నీషియన్ పవన్ పాల్గొన్నారు.

అప్రమత్తతో అగ్ని ప్రమాదాల నివారణ

నిడదవోలు: చిన్నపాటి జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాస రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. నీటి, గ్యాస్‌తో మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం అగ్నిప్రమాదాలు-నివారణ చర్యలపై ముద్రించిన పోస్టర్లను ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఫైర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాల వర్షంతో రైతుల ఇక్కట్లు

నిడదవోలు రూరల్: వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. నిడదవోలు మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతోపాటు ఒక మోస్తరు వర్షం కురవడంతో రాశులుగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎండ రావడంతో ధాన్యం రాశులపై ఉన్న బరకాలను తొలగించి ఆరబెట్టారు. దీంతో కూలీలకు అదనంగా ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నిడదవోలు: కొవ్వూరు మండలం విజ్జేశ్వరం-మద్దూరులంక దగ్గర గోదావరిలో ఈతకు వెళ్లి మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆర్థిక సాయం అందజేరని పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్ తెలిపారు. పట్టణంలోని చర్చిపేటకు చెందిన ప్రవీణ్ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు, రాజమండ్రికి చెందిన హర్ష కుటుంబ సభ్యులకు రూ.10 వేలు చొప్పున అందజేసినట్టు తెలిపారు. రంగా రమేష్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మంత్రి దుర్గేష్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై కేసు నమోదు

కొవ్వూరు: దొమ్మేరు జగనన్న కాలనీలో లే అవుట్‌లో 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ చొటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

క్వారీల్లో అక్రమ తవ్వకాలు

- అనుమతి పొందిన దానికంటే అధిక విస్తీర్ణంలో తవ్వకాలు
- మామూళ్ల మత్తులో నిబంధనలకు పాతర
- క్వారీ గోతులను పూడ్చకుండా వదిలేస్తున్న వైనం
- చెరువులను తలపిస్తూ ప్రజల, పశువుల ప్రాణాలను హరిస్తున్న క్వారీ గోతులు


కొవ్వూరు మండలం దేచెర్ల సమీపంలోని క్వారీ గోతులు

కొవ్వూరు: క్వారీలు, క్రషర్ల నిర్వహణలో నిబంధలకు తిలోదకాలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దేవరపల్లి, కొవ్వూరు మండలాల పరిధిలో విస్తరించిన క్వారీలు, క్రషర్లను నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 110 క్వారీలు, 60కి పైగా క్రషర్లు ఉన్నాయి. వీటి నిర్వహణలో నింబంధనలు గాలికి వదిలేయడంతో ఈ ప్రాంత ప్రజలు కాలుష్య కోరల్లో మగ్గుతూ అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మంగళవారం కొవ్వూరు మండలం దేచెర్ల పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ మొక్కుబడి తంతుగా నిర్వహించారనే విమర్శలున్నాయి.

రోడ్డుపై దుమ్ము ధూళితో ప్రమాదాలు

క్వారీలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో చట్టపరంగా అధికారులు సవాలక్ష ఆంక్షలు, నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. అనంతరం ఏ ఒక్క క్వారీ, క్రషర్ యాజమాని నిబంధనలు పాటించిన దాఖలాల్లేవు. దుద్దుకూరు నుంచి ఐ.పంగిడి వరకు ఈజీకే రోడ్డు (రాష్ట్ర రహదారి) వరకు క్రషర్ల నుంచి దుమ్ము ధూళి కారణంగా ప్రయాణానికి నరకయాతన అనుభవించాల్సిందే. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు సంభవించి ఎంతో మంది గాయాలపాలవడంతోపాటు కొందరు ప్రాణాలు కోల్పోయారు.

నిబంధనలకు పాతర

ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వారీ అనుమతి పొందిన యజమానులు నిర్దేశించిన రాయి, మట్టి, కంకర తవ్వకున్న తర్వాత గోతులను పూడ్చాలి. క్వారాల ద్వారా లాభాలు ఆర్జించిన యజమానులు గోతులను పూడ్చడం లేదు. అనుమతి పొందిన దానికంటే రెండు మూడు రెట్లు విస్తీర్ణంలో రాయి తవ్వకుంటూ సొమ్ము చేసుకుంటున్నా ఏవిధమైన చర్యల్లేవు.

క్వారీ గోతుల్లో పడి మృత్యువాత

ఒక్కో క్వారీ గొయ్యిని 100 నుంచి 200 అడుగుల లోతు వరకు తవ్వారు. ఇప్పటికే అనేక మంది ఆ గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోయారు. అనేక పశువులు నీటి కోసం వెళ్లి గోతుల్లోకి జారి మృత్యువాత పడ్డాయి. క్వారీ గోతుల్లోకి వర్షపు నీరు చేరి దుర్గంధభరితంగా మారాయి. క్వారీ తవ్వకానికి వినియోగించే పేలుడు పదార్థాల కారణంగా గోతుల్లో నిల్వ ఉన్న నీళ్లన్నీ విషతుల్యమవడంతో మూగ జీవాలు ఈ నీటినే తాగి రోగాల పాలవుతున్నాయి. క్వారీ పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి.

భవనాలకు బీటలు

రాళ్ల తవ్వకానికి ప్రమాదకంగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. నిషేధిత మందుగుండు సామగ్రిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. గతంలో దుద్దుకూరులో డీఎస్పీ జానకీ షర్మిల పెద్ద ఎత్తున ప్రమాదకరమైన జిలెటెన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి తీసుకున్నదాని కంటే అదనపు మోతాదులో పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. దీంతో గతంలో లక్ష్మీపురంలో పేలుళ్ల ధాటికి రాళ్లు ఎగిరి పడి పలువురి భవనాలు బీటలు తీశారు. దేచెర్లలోనూ ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రామాన్ని ఆనుకుని క్వారీ ఉండడంతో ఇక్కడ పేలుళ్ల ధాటికి గతంలో పాఠశాల భవనం, ఇళ్లపై పడ్డాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖ సిబ్బంది మామూళ్ల మత్తులో ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ


దేచెర్లలో ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఆర్డీవో రాణి సుస్మిత, పర్యావరణ ఇంజనీర్ శంకర్రావు

క్వారీ అనుమతుల నిమిత్తం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయం అంతా ఒక బూటకంగా మారింది. ముందుగా సభ నిర్వహించే గ్రామాల్లో టాంటాం వేయాల్సి ఉంటుంది. క్వారీ నిర్వాహకులు ఓ పథకం ప్రకారం కొన్ని ప్రదేశాల్లో టాంటాం వేసినట్లుగా వీడియోలు తీసి అధికారులకు అప్పగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి గ్రామ ప్రజలకు ఈ ప్రజాభిప్రాయ సదస్సుపై పూర్తి స్థాయిలోనే సమాచారం ఉండడం లేదు. దేచెర్ల రెవెన్యూ పరిధిలో క్వారీ అనుమతి కోసం మంగళవారం ఏర్పాటు చేసిన సభ గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. పైగా ఈ సభ నిర్వహించిన ప్రదేశం క్వారీ, క్రషర్స్ యూనియన్ నాయకుడికి చెందినది కావడం గమనార్హం. గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో సభ నిర్వహణపై ఎటువంటి ప్రకటన లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వీరమళ్ల నారాయుడు, మాజీ ఎంపీపీ పీకే రంగారావు, స్థానికులు అధికారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వారిని, కొద్ది మంది స్థానికులను తీసుకొచ్చి ప్రజాభిప్రాయం కార్యక్రమాన్ని మొక్కుబడి తంతుగా ముగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారుల మాత్రం ఇదంతా నిబంధనలకు లోబడి నడుస్తుందని చెబుతున్నారు.


దేచెర్ల సమీపంలో తవ్వి వదిలేసిన క్వారీ గోతుల్లోకి చేరిన నీరు


దేచెర్ల సమీపంలో ప్రమాదభరితంగా క్వారీ గొయ్యి


కొవ్వూరు మండలం ఐ.పంగిడి సమీపంలో క్రషరు నుంచి దుమ్ము లేస్తున్న దృశ్యం

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అజయ్‌బాబు


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు శిక్షణ నిస్తున్న అధికారులు


ఉండ్రాజవరంలో విపత్తు నివారణ చర్యలపై మాట్లాడుతున్న తహసీల్దార్ పీఎస్‌డీ.ప్రసాద్

గోపాలపురం: వేసవిలో వచ్చే ఈదురుగాలులు, అకాల వర్షాలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కె.అజయ్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రకృతి వైపరీత్యాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.శ్రీనివాస రావు, ఎంపీడీఓ కె.శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై శిక్షణ

తాళ్లపూడి: విపత్తు నిర్వహణ అంశంపై వివిధ శాఖల అధికారులకు తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎల్‌ఈడీ స్క్రీన్‌పై మూడు రోజుల పాటు శిక్షణ సమావేశాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ పశు సంవర్ధక శాఖ ఏడీ రవి వర్మ మాట్లాడుతూ విపత్తుల ప్రమాదాన్ని అంచనా వేయడం, వాటిని తగ్గించడం, విపత్తుల నుంచి సంభవించే నష్టాలను తగ్గించేందుకు లేదా నివారించేందుకు తీసుకోవాల్సిన తగిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టీబీ వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ పి.మోహనభారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్ సూర్జహాన్, మండల వ్యవసాయ శాఖ అధికారి జి రుచిత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అవగాహన కల్పించాలి

ఉండ్రాజవరం: విపత్తుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో కొవ్వూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం విపత్తు నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అనుకోకుండా సంభవించే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలతో పాటు వైపరీత్యాల ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి ఎం.సందీప్, ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్డీ అంజనేయ శర్మ, ఏవో విశ్వాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ పాల్గొన్నారు.

బైరెడ్డిని కలసిన నాయకులు


విజయవాడలో బైరెడ్డి సిద్ధాంతరెడ్డిని కలసిన కంతమణి రమేష్‌బాబు, నాయకులు

కొవ్వూరు: రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధాంతరెడ్డిని సోమవారం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమణి రమేష్‌బాబు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు.మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం సత్యనారాయణప్రసాద్ ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

బడిబాట ర్యాలీ


భీమోలులో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని భీమోలు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం అంకం సతీష్ అన్నారు. మండలంలోని భీమోలు ఎంపీయూపీ పాఠశాల వద్ద మంగళవారం బడిబాటపై ర్యాలీ నిర్వహించారు. అందరూ చదవాలి అందరూ ఎదగాలి, ఆడపిల్లలు చదువులు అవనికే వెలుగు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అయిదు సంవత్సరాలు దాటిన అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యను అభ్యసించిన 10 మంది పిల్లలను ఎంపీయూపీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.నాగమణి, ఉపాధ్యాయులు తేజశ్విని, సీఆర్పీ కె.నాగరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

దేవరపల్లి: భూముల రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు కోరారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో జరుగుతున్న భూముల రీసర్వే పనులపై గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ, చిన్నాయగూడెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని రీ సర్వే చేశామని చెప్పారు. గ్రామంలో సుమారు 4,500 ఎకరాల భూములున్నాయన్నారు. వంద రోజుల్లో 20 బృందాలు భూముల రీ సర్వే చేశాయని తెలిపారు. గ్రామంలో ఎక్కువగా జమీందారి భూములున్నందున అన్ని కోణాల్లో పరిశీలించి సర్వే పనులు పూర్తి చేశామని చెప్పారు. సర్వేలో హెచ్చుతగ్గులుంటే రెవెన్యూ అధికారులు ఇచ్చే 19 నోటీసు తీసుకుని అభ్యంతరాలపై ఫిర్యాదు చేయాలని, డివిజన్ స్థాయిలో పరిశీలించి, ఆ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఎకరాకు ఐదు సెంట్ల కంటే ఎక్కువ హెచ్చు తగ్గులుంటే సరిచేస్తామని తెలిపారు. ప్రతి మండలంలో రెండు మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా భూముల రీ సర్వే చేస్తున్నామన్నారు. జనవరి 4న చిన్నాయగూడెంలో రీ సర్వే పనులు ప్రారంభించామని జేసీ తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, జిల్లా సర్వేయర్ బీఎల్ నారాయణ, ఐఎఫ్ఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్ జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

నష్టాల బాటలో మొక్కజొన్న రైతులు


భీమోలులో నేలకొరిగిన మొక్కజొన్న తోట

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో 116 హెక్టార్లలోని మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వారం రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు, అకాల వర్షాలకు మొక్కజొన్న సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. మండలంలో సుమారు 55 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, అందులో 290 ఎకరాల్లో పంట నేలమట్టమైంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని భీమోలులో 200 ఎకరాలు, కొవ్వూరుపాడులో 20, సగ్గొండలో 22, జగన్నాథపురంలో 11, సంజీవపురంలో 15, గంగవరంలో 14 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.రాజారావు తెలిపారు. సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. వాతావరణ మార్పులతో మిగిలిన పంటైనా చేతికొస్తుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

క్రెడిట్ కార్డుపై అప్పు చేసి తీర్చలేక ఆత్మహత్య

కొవ్వూరు: క్రెడిట్ కార్డులపై అప్పులు తీసుకుని తీర్చలేక పెనకనమెట్ట గ్రామానికి చెందిన తాడి వినోద్ (30) అనే యువకుడు సోమవారం ఉదయం కలుపుమందు తాగి ఆత్మహ త్యయత్నానికి పాల్పడినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అతడ్ని మొదట కొవ్వూరు ఆసుపత్రికి అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారన్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులను హడలెత్తించిన వడగళ్ల వాన


కొవ్వూరులో వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

కొవ్వూరు: నియోజకవర్గంలో పలుచోట్ల మంగళవారం వడగళ్ల వాన కురిసింది. భారీ వర్షం కురవడంతో కళ్లల్లో ఉన్న ధాన్యం తడి ముద్దయ్యింది. ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడం కోసం రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కొవ్వూరు, దొమ్మేరు, కాపవరం గ్రామాల్లో భారీ వర్షం కురవడంలో హైవే ఆరబెట్టిన ధాన్యపు రాశులు పూర్తిగా నీట మునిగాయి. రానున్న నాలుగు రోజులు పాటు వర్ష సూచనతో రైతులు మరింత కలత చెందుతున్నారు.భారీ వర్షం కారణంగా కొవ్వూరు, దొమ్మేరులో రోడ్లపై భారీగా నీరు నిలిచింది. వర్షానికి తోడు వడగళ్ల పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'తృప్తి' సేవా కార్యక్రమాలు విస్తృతం

నిడదవోలు రూరల్: తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమిశ్రగూడెంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని ట్రస్ట్ చైర్మన్ వడ్లమూడి దేవదాసు అన్నారు. సమిశ్రగూడెం అరుంధతీపేటలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద రూ.4 లక్షలతో చేపట్టిన కాంక్రీట్ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని, షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు నేతల నాని, ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి రాకడ సుదర్శనరాజు, బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి రాజారత్నం, కార్యదర్శి కొల్లి శ్రీను, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పుష్కర నిధుల దుర్వినియోగంపై చర్యలు

కొవ్వూరు: గోదావరి పుష్కరాలు (2015) సమయంలో నిర్వహించిన పనులకు సంబంధించి నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ముగ్గురు రిటైర్డు ఉద్యోగుల పింఛన్‌లో మూడు శాతం కోత విధించాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లో గోదావరి ఏటిగట్టు సుందరీకరణ పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు విచారణ నిర్వహించి అవకతవకలు గుర్తించారు. వీరి నివేదిక ఆధారంగా చేసుకుని అప్పట్లో పనిచేసి ప్రస్తుతం పదవీ విరమణ పొందిన ఏఈ పీవీ ప్రభాకరరావు, సీనియర్ అసిస్టెంట్ వైవీ నరసింహరావు పెన్షన్‌లో మూడు ఏడాది పాటు నిలుపుదల చేయాలని, మేనేజర్‌గా పనిచేసిన బి.శ్రీధర్‌కి రెండేళ్ల పాటు మూడు శాతం పింఛన్ నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.